
## అండగా నిలిచిన

# సర్కారును ఆదరించాలి

- స్వరాష్ట్రంలోనే ముస్లిం మైనార్టీలకు సముచిత ప్రాధాన్యం
- కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు
- బీఆర్ఎస్ పాలనలో మతసామరస్యం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ
- పెద్దపల్లి, గోదావరిఖనిలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాలు
- హాజరైన బీఆర్ఎస్ అభ్యర్థులు దాసరి, కోరుకంటి
- రామగుండంలో రోడ్‌షో



రోడ్‌షోలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్‌అలీ, చిత్రంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్

పెద్దపల్లి, నవంబర్ 22(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి/ గోదావరిఖని నవంబర్ 22: స్వరాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చిన బీఆర్ఎస్ సర్కారును ఆదరించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌ఆలీ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. తనకు హోంమంత్రిగా అవకాశం ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. బుధవారం పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్స్, మార్కండేయ కాలనీ బృందావన్ గార్డెన్స్‌లో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అలాగే రామగుండంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటికి మద్దతుగా రోడ్ షో చేపట్టారు. ఆయాచోట్ల హోంమంత్రి మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలన కర్ఫ్యూ, కన్నీళ్లతోనే గడిచిపోయిందని గుర్తు చేశారు. కానీ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మతకల్లోలాలు, కన్నీళ్లు లేవని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిది ఆర్ఆర్ఎస్ భావజాలమని, రాజకీయంగా ఎదిగేందుకు టీడీపీలో చేరాడని, టీడీపీ దుకాణం బంద్ కాగానే కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. ఢిల్లీ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ముస్లిం మైనార్టీలను పట్టించుకోలేదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడంలో ముస్లిం మైనార్టీలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పదేండ్ల కింద పెద్దపల్లి ఎలా ఉంది? ఇప్పుడేలా ఉంది ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఎన్నికల వేళ ఆగం కావద్దని, అభివృద్ధి, అభ్యర్థి ప్రవర్తన, పార్టీ చరిత్రను మదిలో పెట్టుకోని ఓటు వేయాలని కోరారు. ముస్లిం అన్ని విధాలుగా అండగా ఉంటున్న బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. ఇక్కడ దాసరి మనోహర్‌రెడ్డి, అక్కడ కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, టీఎస్ఎంఎఫ్‌సీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్. అక్బర్, పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ నాజ్మిన్ సుల్తానామొబిన్, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సీ సత్యనారాయణ రెడ్డి, హమీద్, బేగ్, ప్రజాప్రతినిధులు, నాయకులు లైసెట్టి భిక్షపతి, దేవనంది రమాదేవి, గాదె మాధవి, వునుకొండ సుజాత, సునీల్, రేవెళ్లి స్వామి, మొబిన్, పైడ రవి, అస్రఫ్, ఖదీర్‌ఖాన్, ఫహీం, జావిద్, జాకిర్ హుస్సెన్, సర్వర్, తబ్రేజ్ పాల్గొన్నారు.

### ముస్లింలకు అండగా ఉంటా...

కేసీఆర్ మార్గనిర్దేశంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నది. అన్ని మతాలకు సమ ప్రాదాన్యత ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. పేద ముస్లింలు పవిత్ర రంజాన్‌ను ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వం కానుకలకు అందజేస్తుంది. ఇమాం, మౌజంలకు గౌరవ వేతనం ఇచ్చింది. కాంగ్రెస్ ముస్లిం సంక్షేమాన్ని ఎనాడు పట్టించుకోలేదు. 2014లో నేను ఎమ్మెల్యే కాగానే తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేసిన. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందుతున్నది. పెద్దపల్లిలో గల్లీ గల్లీకి సీసీ రోడ్డు, డ్రైనేజీ వేయించిన. పెద్దపల్లి ఈద్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన. మళ్లీ గెలిస్తే భవిష్యత్తులో మరిన్నీ అభివృద్ధి పనులు చేస్తా. ముస్లింలు ఓటు వేసి ఆశీర్వదించాలి.

### రామగుండంలో రోడ్‌షో

జ్యోతినగర్(రామగుండం), నవంబర్ 22: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే ముస్లిం మైనారిటీలకు పెద్దపీట వేశారని, గత ప్రభుత్వాలు కేవలం ముస్లింలను ఓటు బ్యాంకును వాడుకున్నాయని, హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్ర రామగుండం మసీద్ టర్నింగ్‌లో రోడ్‌షో నిర్వహించారు. ప్రచార రథంపై హోం మంత్రి ముస్లింలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణలోనే ముస్లింల పేద కుటుంబాలకు షాదీ ముబారక్ పథకం, పిల్లలకు మైనారిటీ హస్టల్స్ వచ్చాయన్నారు. ముస్లింల అభ్యున్నతికి కేసీఆర్ కృషిచేస్తున్నారని ముస్లిం మైనారిటీలు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అండగా నిలవాలన్నారు. రామగుండం ఎమ్మెల్యే బరిలో నిలిచిన కోరుకంటి చందర్‌ను గెలిపించుకోని ఇక్కడి బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇక్కడ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అక్బర్ హుస్సెన్, రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్, మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు కౌశికలత, కన్నూరి సతీశ్‌కుమార్, ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి, ఎండీ సాజీర్, అహమ్మద్‌బాబు, బొడ్డుపల్లి శ్రీనివాస్, తిరుపతి, కుమార్, గంగాప్రసాద్, తదితరులు ఉన్నారు.





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చందర్

# కార్మికులకు కాంగ్రెస్ చేసిందేమీలేదు

- బీఆర్ఎస్ పాలనలోనే న్యాయం
- కారుణ్య నియామకాలను పునరుద్ధరించినం
- సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలి
- రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్
- గోదావరిఖనిలో ప్రజాఆశీర్వాదయాత్ర

గోదావరిఖని, నవంబర్ 22: కాంగ్రెస్ పార్టీ సింగరేణి కార్మికులకు చేసిందేమీలేదని రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ విమర్శించారు. ఈ నెల గోదావరిఖనిలోని స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఖని చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్జీ–1 జీడీకే–2ఏ గనిపై ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని కార్మికులను ఆప్యాయంగా పలకరించారు. కోరుకంటి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక దశాబ్ది కాలంలోనే కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. అంతేగాక సీఎం కేసీఆర్ సహకారంతో కేటీఆర్ అండదండలతో రామగుండాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశానని అన్నారు. రామగుండంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయించానని చెప్పా రు. యువత ఉపాధి కోసం పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌చే రూ.30 కోట్లతో ఐటీ పార్కు ఫౌండేషన్, 102 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు డబ్బు సంచులతో ఓటర్లను మభ్య పెట్టడానికి వస్తున్నారని ప్రజలు గమనించాలన్నారు. 30న జరిగే ఎన్నికల్లో స మాజ అభివృద్ధిని కాంక్షించే కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మేయర్ అనిల్ కుమార్, సర్పంచ్ లయ్యాపతి, నాయకులు కౌశిక హరి, రాంమ్మూర్తి, మురళీధర్‌రావు, దేవరాజు, పిల్లి రమేశ్, చిప్ప రాజేశం, వాసు, మండ రమేశ్, శ్రీహరి, చంద్రయ్య తదితరులున్నారు.

### 49వ డివిజన్‌లో ప్రచారం..

అలాగే స్థానిక 49వ డివిజన్‌లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. స్థానిక మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. 2018లో గెలిచిన తర్వాత కరోనాతో రెండేళ్ల పాటు రామగుండంలో అభివృద్ధి కుంటుపడిందని ఆ తర్వాత కోట్లాది రూపాయలతో అభివృద్ధిని ఆపకుండా ఇతర ప్రాంతాలకు ధీటుగా తీర్చిదిద్దాననన్నారు. 53 యేండ్ల కాంగ్రెస్ పాలనలో ఆకలి చావులు, ఆత్మహత్యలతో ప్రజల జీవనం ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కొత్త పథకా లు అమలు కావాలంటే మళ్లీ మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి మ్యానిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్ దుబాసి లలిత మల్లేశ్, రాజ్‌కుమార్, నాయకులు మురళీధర్, పీటీ స్వామి, నూతి తిరుపతి, స్వామి, సతీశ్, జాహిద్, లింగయ్య, శ్రీనివాస్, యాకుబ్ తదితరులున్నారు.

# కాంగ్రెస్ వస్తే అరాచక పాలన

- మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- ఆర్వోకు ఫిర్యాదు..ఈసీకి ఫిర్యాదు చేస్తానని వెల్లడి

మంథని, నవంబర్ 22: పొరపాటున చెయ్యికి ఓటేస్తే అరాచక పాలన వస్తుందని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ హెచ్చరించారు. మంథని నియోజకవర్గంలో నేరచరిత్ర ఉన్నవారిని ప్రోత్సహిస్తూ బీఆర్ఎస్‌పై దాడులకు పూనుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. మహాముత్తారం మండలం మీనాజీపేటలో మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, అనిల్‌రెడ్డిపై దాడి చేసిన ఘటనతో పాటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై జరుగుతున్న వరుస దాడులను ఖండించారు. ఈ మేరకు బుధవారం మంథని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంథనిలో 40 ఏండ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఇలాంటి నీచ రాజకీయాలకు తెరలేపిందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే అరచకాలకు అడ్డంపడుతున్న తనను అంతం చేసేందుకు కుట్రలకు దిగుతున్నారని మండిపడ్డారు. మాజీ నక్సలైట్లు, రౌడీలను ప్రోత్సహిస్తున్నాడన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో ఎంతో మందికి తుపాకులు ఇప్పించిన చరిత్ర శ్రీధర్‌బాబుకు ఉన్నదని విమర్శించారు. ముత్తారం మండలం ఓడెడ్ సర్పంచ్ బక్కారావుకు మహాముత్తారం మండలం మీనాజీపేటలో ఏం పని ఉందని ప్రశ్నించారు. మీనాజీపేటలో ఓటర్లకు డబ్బులు పంచుతుండగా వారించిన బీఆర్ఎస్ నేతలపై దాడికి పాల్పడ్డారన్నారు. బక్కారావు దాడిలో రాజిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. అయితే బక్కారావు తనకు తానే గాయం చేసుకుని బీఆర్ఎస్‌పై అబండాలు మోపుతున్నాడని ఆక్షేపించారు. తనను మధూకర్ నీ అంతూ చూస్తా.. నిన్ను చంపేస్తా.. బీఆర్ఎస్‌నాయకుల ఇండ్లపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులు చేయాలని మాట్లాడటం ఎంత వరకు సమంజమన్నారు. ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా పని చేసిన తనను అంతమొందించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరాచకాలు చేసేది వాళ్లే.. తిరిగి ఆరోపణల చేసేది వాళ్లేననన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆగడాలు, ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో వారికి తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. మీనాజీపేట ఘటనపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం సుమలత, కొత్త శ్రీనివాస్, ఎగోలపు శంకర్‌గౌడ్, ఎక్కటి ఆనంతరెడ్డి, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, సెగ్గెం రాజేశ్ పాల్గొన్నారు.

### మధూకర్ ఫిర్యాదుపై విచారణ చేస్తాం: ఆర్వో హనుమా నాయక్

మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై వరుసగా జరుగుతున్న దాడులపై బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ బుధవారం ఆర్వో కార్యాలయంలో ఆర్వో హనుమానాయక్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో హనుమానాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నారని మధూకర్ ఇచ్చిన ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.

# దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవారెడ్డి



మాట్లాడుతున్న వాసుదేవారెడ్డి, చిత్రంలో సర్దార్ రవీందర్‌సింగ్

పెద్దపల్లి కమాన్, నవంబర్ 22: తెలంగాణ సర్కారు దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవారెడ్డి అన్నారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధి బందంపల్లిలోని స్వరూప గార్డెన్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి వాసుదేవారెడ్డి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో దివ్యాంగులకు పింఛన్ ఇవ్వని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగులకు కేవలం రూ. 750 నుంచి రూ. వెయ్యి మాత్రమే ఫించన్లు ఇస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడకు ముందు మన రాష్ట్రంలో రూ. 200 పింఛన్ మాత్రమే ఉండేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రూ. 1500 నుంచి 2016 వరకు పెరిగిందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ. 6016 ఫించన్ అవుతుందని తెలిపారు. ఇంటర్ చదివి దివ్యాంగులకు స్కూటీలు, ల్యాప్‌ట్యాప్‌లు, అంధులకు పరికాలు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్ తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేయాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వికలాంగుల సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని దాసరి మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్‌చంద్ జైన్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.